క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



ఎమ్మెల్యేను కలసిన డీఎస్పీ శ్రీధర్

బొబ్బిలి: నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పుల్లూరు శ్రీధర్ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణపై కాసేపు చర్చించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



నందబలగలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

రాజాం : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్ తెలిపారు. మండలంలోని నందబలగ, లక్ష్మీపురం, బొడ్డవలస గ్రామాల్లో తాగునీటి బోర్లకు గురువారం మరమ్మతులు చేయించారు. బోర్ మెకానిక్‌లు గ్రామాల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామంలోని నూతనంగా ప్రతిష్ఠించిన అయ్యప్పస్వామిని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా గ్రామంలో జరుగుతున్న ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు వద్ద నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి



ఇంటింటి ధర్మప్రచారంలో ధూపం వాసు, తదితరులు

బొబ్బిలి: హిందూ దేశంలో సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందని సమరసతా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపం వాసు అన్నారు. మండలంలోని ఎం. బూర్జవలస, దిబ్బగుడ్డివలస, రాజచెరువువలస గ్రామాల్లో గురువారం ఇంటింటి ధర్మప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. మండల కన్వీనర్ గేదెల జనార్దనరావు, మరడ స్వామినాయుడు, వాసిరెడ్డి సత్యనారాయణ ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ

రాజాం : పట్టణంలోని కొండంపేట గ్రామంలో శ్రీధర్మశాస్తా హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు ఈ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో గురువారం పాల్గొని పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయ కమిటీ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించింది. ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావుతో పాటు కొండంపేట, పరిసర గ్రామాల ప్రజలు ఈ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

డాక్టర్ బదిలీ



పెదపాలవలసలో హద్దురాళ్లు దించడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దోల రాజేశ్వరరావు

మెంటాడ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న శృతికి డీఎంహెచ్‌ఓ కార్యాలయం డీఐఓగా బదిలీ జరిగింది. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ రమణకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మెంటాడ ఆస్పత్రికి కొత్త వైద్యుడిని త్వరలో నియమించనున్నారు.

వేగవంతంగా హద్దు రాళ్ల ఏర్పాటు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న, శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే, సరిహద్దుల గుర్తింపు పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్లు పాతే కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని తహసీల్దార్ దోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పూనువలస పంచాయతీ పెదపాలవలసలో హద్దురాళ్లు పాతే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, హద్దురాళ్లు పాతడం సకాలంలో పూర్తి చేయాలన్నారు. సచివాలయ సర్వేయర్లు ఎక్కడ మార్కింగ్ ఇస్తే అదే ప్రాంతంలో హద్దురాళ్లు వేయించాలని సూచించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు ఉన్నారు.

మనబడిలో చేర్పించండి..

- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- కార్పొరేట్‌కు తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు



కార్పొరేట్ స్థాయిలో ఉన్న రామభద్రపురం ఉన్నత పాఠశాల భవనం



తారాపురంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రామభద్రపురం: ప్రతి చిన్నారీ చదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగానే 'మనబడి నాడు – నేడు' కార్యక్రమాన్ని రూపొందించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. విద్యార్థులకు అవసరమయ్యే అన్నిరకాల వసతులు కల్పించారు. కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో భవనాలు సమకూర్చడంతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్నారు. అలాగే అమ్మఒడి ప్రోత్సాహం కూడా విద్యార్థుల తల్లులకు అందిస్తున్నారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన సాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. పాఠశాలల్లో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. తారాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం డీఎల్ఎమ్ సూర్యకుమారి, ఉపాధ్యాయులు బి. శంకరరావు, పి. తిరుపతిరావు, వై. శ్రీదేవి, తదితరులు గురువారం గ్రామంలో పర్యటించి ప్రచారం నిర్వహించగా... విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అపూర్వ స్పందన లభించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య...



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు ఉన్నత విలువలు, సంస్కారం, సంప్రదాయాలు నేర్పుతాం. ఆట పాటలతో కూడిన విద్య మా ప్రత్యేకత. బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలి.

– లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

ఉపాధి పనుల పరిశీలన



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఏపీఓ



మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ, తదితరులు

సంతకవిటి: మండలంలోని గరికిపాడులో నాయకమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేతనదారులు రెండుపూటలా కొలతలు ప్రకారం పని చేస్తే రూ.272 వేతనం లభిస్తుందని తెలియజేశారు. వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బకు గురికాకుండా పని ప్రదేశాలలో టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని క్షేత్ర సహాయకులకు సూచించారు.

విధిగా ఉపాధి పనులు

రేగిడి : ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు తప్పనిసరిగా చేయించాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పని కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గతంలో గ్రామాల్లో గుర్తించిన పనులను చేయించాలని వివరించారు. ఏ గ్రామం నుంచి కూడా వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఈసీ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొబ్బిలి: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గజపతినగరం క్లస్టర్ పరిధిలో 56 వేల మందికి పని కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీడీ జనార్దనరావు అన్నారు. మండలంలోని కారాడ, అలజంగి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతానికి సుమారు 50 వేల మందికి పని కల్పించామన్నారు. ఎండల తీవ్రత కారణంగా ఉపాధి వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ శిక్షణ విభాగం కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు, ఈసీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

తెర్లాం: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్సై ఆర్. రమేష్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొమ్మిది మద్యం సీసాలు తరలిస్తున్నాడు. వాహన తనిఖీల్లో భాగంగా నిందితుడు పట్టుబడడంతో పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

అభినందనలు



గణేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: తిరుపతిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న మండలంలోని అలజంగికి చెందిన అథ్లెట్ రాపాక గణేష్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అభినందించారు. 100, 200 మీటర్ల పరుగుపందెం పోటీల్లో గణష్ బంగారు పతకాలు సాధించాడు. గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గణేష మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అలజంగి ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు, ఏఎంసీ డైరెక్టర్ అల్లు త్రినాథ, న్యాయవాది రుంకాన ప్రసాదరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష



సచివాలయ సిబ్బందితో మున్సిపల్ చైర్మన్ సమీక్ష

బొబ్బిలి: పట్టణంలోని సచివాలయాల సిబ్బందితో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. వినతులు, ప్రభుత్వ పథకాల అమలు, అర్హుల గుర్తింపు వంటి పనులు నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. వైస్‌చైర్మన్ గొలగాని రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా మోడల్ ద్వారా కూరగాయల సాగు



చాటాయవలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి : మండలంలోని ఉంగరాడ యూనిట్ గుళ్లపాడు క్లస్టర్ పరిధిలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంశక్తి సంఘం సభ్యులకు సంబంధించిన పది సెంట్ల భూమిలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులు ఫార్మా మోడల్ ద్వారా కూరగాయలను సాగు చేసేందుకు ముందుకొచ్చారు. గురువారం ప్రకతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సీహెచ్ శారద, ఎల్2 పార్వతమ్మ, గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణల ఆధ్వర్యంలో కూరగాయలు సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. 365 రోజులూ ఆకుకూరలు, తీగజాతి, మొక్క జాతి కూరగాయలను నిరంతరాయంగా పండించుకోవచ్చన్నారు. ప్రకతి సేద్యం ద్వారా ఈ పంటలను సాగు చేసుకుంటే రైతులకు నిత్యం రాబడి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన



సచివాలయ భవనం శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బాడంగి: ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన తీసుకురావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. అలాగే గ్రామాల్లో రైతుభరోసా, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. మండలంలోని ఆనవరంలో 61.80 లక్షల రూపాయల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే నూతన భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సచివాలయాల ఏర్పాటు వల్ల ప్రజలు ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. ఏ పనైనా గ్రామంలోనే చేసుకునే వీలుందని చెప్పారు. అలాగే ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు లభిస్తున్నాయన్నారు. అలాగే రైతులు గ్రూపుగా ఏర్పడితే యంత్ర పరికరాలు రాయితీపై అందిస్తామని తెలిపారు. ఆనవరం గ్రామాభివృద్ధికి నాలుగేళ్లలో 8.82 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, సలహాదారు మధుసూధనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ శంకరరావు, డీఈఈ అప్పారావు, ఎంపీడీఓ.అక్కారావు, ఏఈ. రమేష్, సర్పంచ్ వాకాడ వెంకటనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈదుబిల్లి లక్ష్మి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, మంగమ్మ, డోకల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి దివ్యవాణి, కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ బి.రమేష్, సీడీపీఓ రాజ్యలక్ష్మి, వాడాడ పీహెచ్‌సీ సిబ్బంది, సచివాయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 530 పైబడిన మార్కులు సాధించిన విద్యార్థినుల నుంచి యడ్ల నీరజారాణి గర్ల్స్ ఎస్సెస్సీ – 2023 అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం నియోజకవర్గంతో పాటు తెర్లాం, పాలకొండ, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, బూర్జ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ నెల 21న అవార్డుకు సంబంధించి పరీక్ష డోలపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 9గంటలకు నిర్వహించనున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు సామంతుల సింహాద్రినాయుడు అన్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడించి వీరిలో ముగ్గురిని ఎంపిక చేసి ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ రూ. 15 వేలు, తృతీయ రూ.10వేలు చొప్పున బహుమతి ఇవ్వనున్నామని తెలిపారు. మ్యాథ్స్, సైన్స్, జీకే, కరెంట్ అఫైర్స్‌పై మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థినులు పేరు, స్కూల్ పేరు, హాల్ టిక్కెట్ నెంబర్, మార్కుల వివరాలను ఈ నెల 19 సాయంత్రం 6గంటల్లోగా 98859 78658 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థినులు మార్కుల జాబితాతో పాటు హాల్‌టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని అమ్మిగారి కోనేటిగట్టు, ఐటీఐ కాలనీ, చీపురుబంద ప్రాంతాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేస్తూ విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, మండల కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బి. రవికుమార్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్. రాజారావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి మేడపల్లిలో 'గడప గడపకు..'

మెంటాడ: మండలంలోని మేడపల్లిలో శుక్ర, శనివారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఈఓ త్రినాథరావు



పెరుమాళిలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని పెరుమాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫెయిల్ అయిన విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించి కళాశాలల్లో చేరవచ్చని తెలిపారు. ఆయనతో పాటు పెరుమాళి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి, తదితరులున్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో గురువారం ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులు నిత్యం ఇంగ్లిష్ మందులనే వాడుతుండేవారు. ఆయుర్వేద వైద్యంపై అంతగా అవగాహన లేకపోవడంతో కొత్తగా వచ్చిన వైద్యాధికారి సునీల్‌కుమార్ ప్రజలకు ఆయుర్వేద వైద్యాన్ని అందించి దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీర్ఘకాలిక రోగాలకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామశేషు, ఏఎన్ఎం స్వాతి, ఆశా వర్కర్ భారతి, లక్ష్మి, యోగా టీచర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఎంపీ బెల్లాన



ప్రతిష్ఠ కార్యక్రమంలో పూజలు చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

సంతకవిటి : మండలంలోని మందరాడ గ్రామంలో గణపతి, షిర్డీసాయి, సత్యసాయి, సత్యనారాయణ స్వామి, నవగ్రహ ఆలయాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. ఖండ్యాంకు చెందిన వేదపండితులు అంపోలు రుద్రకోటేశ్వరరావు శర్మ, రామప్రసాద్‌శర్మలతో పాటు గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు, హోమాలు, యంత్రస్థాపన, కలశస్థాపన అనంతరం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వావిలపల్లి రామకృష్ణంనాయుడు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

సెలవులు పూర్తయ్యేలోగా పనులు పూర్తి



పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మనబడి నాడు–నేడు పథకం కింద నిధులు మంజూరైన ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి సెలవులు ముగిసేలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని పెరుమాళి డీపీఈపీ పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనబడి నాడు – నేడు పథకం ఫేజ్–2 కింద పనులు మంజూరైన పాఠశాలలో పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో బడిఈడు పిల్లల గణనను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు సీఆర్‌పీలున్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే 'గడప గడపకు..'

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బాడంగి: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెదపల్లిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, పాల్తేరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు వంగపండు జోగినాయుడు, కోటిపల్లి సర్పంచ్ మార్పిన శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు పూడి జగదీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవు సత్యనారాయణ, కరణం ఈశ్వరరావు, దళాయి సత్యం, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.